

జై జనార్దనా..

8లో

సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో, కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.



అభినందన

విశాఖ: ఏయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ధనుంజయరావుకు ప్రొఫెసర్లు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు.



వీనులవిందు

విశాఖ: వీఎండీఏ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం గాత్ర విద్వాంసులు ఓ.ఎస్.అరుణ్ (చెన్నై) గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది.

న్యూస్‌రీల్

దివ్యాంగులకు డిజిటల్ విద్య అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహం

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా దివ్యాంగులకు డిజిటల్ విద్యా బోధన అవసరమని రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు డాక్టర్ వై.నరసింహం, డాక్టర్ ఎస్.అమ్మినాయుడు అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డు వైఎంవీఏ హాల్లో మంగళవారం జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు విద్యలో ట్యాబ్‌ల వినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. దివ్యాంగుల్లో అభ్యసన ఫలితాలను రాబట్టేందుకు సమగ్ర శిక్ష ద్వారా ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పాటు 33 రకాల యాప్‌లను అప్లోడ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రీసోర్స్ పర్సన్ సభ్యులు బి.మహాలక్ష్మీనాయుడు, పి.సునీల్ కుమార్, అనకాపల్లి ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు, జిల్లాలో 24 మండలాల్లో భవితా కేంద్రాల్లో పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి సాయం



రాముునాయుడు కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఏఎస్ఐ జి.రామునాయుడు భార్య లక్ష్మికి ఆర్థిక సహాయంగా రూ.75 వేలు చెక్కును మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి పూర్తి స్థాయిలో పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో బి.శారదా, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రారంభం



విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ)లో 2024–25 సంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మొత్తం 250 సీట్లలో 37 సీట్ల భర్తీకి అఖిల భారత కోటాలో మంగళవారం మొదటి విడత కౌన్సెలింగ్ చేపట్టారు. నెల్లూరుకు చెందిన కండే శ్రీకర్ (3336), శ్రీకాకుళానికి చెందిన యు.మోహన్ కృష్ణ (4020), విశాఖపట్నం ప్రాంతానికి చెందిన యశశ్రీ (6091), ఎస్టీ కేటగిరీలో 63,527 ర్యాంక్ సాధించిన శ్రీకాకుళానికి చెందిన ఎస్.హితశ్రీ తొలిరోజు ప్రవేశం పొందారు. ఈ నెల 29వ తేదీలోగా అఖిల భారత కోటా సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తెలిపారు. మిగిలిన 85 శాతం సీట్లను రాష్ట్ర కోటా కింద డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ భర్తీ చేస్తుందన్నారు. కొత్తగా చేరిన యూజీ విద్యార్థులకు ప్రిన్సిపాల్, యూజీ అడ్మిషన్ల నోడల్ అధికారి డాక్టర్ ఎ.కృష్ణవేణి స్వాగతం పలికారు.

30న జాబ్‌మేళా

కంచరపాలెం (విశాఖ): జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సి.హెచ్.సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. అమెజాన్ వేర్‌హౌస్, సినర్జీస్ కాస్టింగ్, వరుణ్ మోటార్స్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్, మెడ్‌ప్లస్ ఫార్మా, పేటీఎం, ఇన్నోస్ సోర్స్, ముత్తూట్ గ్రూప్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 668 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. పికర్స్, సార్టర్స్, ఆపరేటర్ ట్రైనీ, రిలేషన్‌షిప్ మేనేజర్, లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్, అసోసియేట్స్, మిషన్ ఆపరేటర్, ట్రైనీ ఆపరేటర్, జూనియర్ రిసెప్షనిస్ట్, ఆఫీసర్ ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్‌టీఏ, ఫార్మసిస్ట్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తదితర పోస్టులకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఎంబీఏ, డిప్లమో, ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులు. 18 నుంచి 35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలకు నెలకు రూ.10,500 నుంచి రూ.21,000 వరకు వేతనం అందిస్తారు.

ఉన్నతాధికారులు శ్రద్ధ వహించాలి



ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిపై దాడులు పెరిగిపోతున్నాయి. ఆస్పత్రుల వద్ద రోగుల బంధువులు ఘర్షణకు దిగడం సమంజసం కాదు. విధుల్లోని మహిళా వైద్య సిబ్బందిపై దాడులు జరుగుతుంటే, ఉన్నత స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. కోల్‌కతా జూనియర్ వైద్యురాలి సంఘటనపై అక్కడ ఉన్నత స్థాయి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు భద్రత కల్పించాలి. – డి.శారద, సీహెచ్‌వో, తుమ్మపాల



ధైర్యం కల్పిస్తేనే విధులకు న్యాయం



ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి పూర్తిగా భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రాత్రి పూట విధులు నిర్వర్తించే మాకు వాచ్‌మెన్‌తో పాటు పోలీసులతో రక్షణ కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయాలి. అప్పుడే ధైర్యంగా రాత్రి పూట వైద్య సేవలను అందించగలుగుతాం.

–బి. అగ్నేస్, స్టాఫ్ నర్స్, దేవరాపల్లి పీహెచ్‌సీ

అనకాపల్లి/దేవరాపల్లి:

ముందు 'చూపు'తో..



ఈ ఏడాది జూలై 25వ తేదిన అనకాపల్లి జిల్లా వడ్డాది మాడుగులకు చెందిన పి. రమణ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ దురదృష్టవశాత్తూ స్ట్రోక్‌తో చనిపోయారు. ఆయన కుమారుడు పందిరి జగన్ వెంటనే స్పందించి చనిపోయిన తన తండ్రి రమణ నేత్రాలు దానం చేయడానికి ఐ బ్యాంక్‌కు నేరుగా ఫోన్ చేసి సంప్రదించారు. మొహిసిన్ ఐ బ్యాంకుకు నేత్రదానం చేసి మరణించిన తన తండ్రి కళ్లకు తిరిగి వెలుగు అందించారు. డిప్లొమా ఇంజినీరింగ్ పూర్తి చేసిన జగన్ సాక్షితో మాట్లాడుతూ..తన తండ్రి మరణించినా ఆ నేత్రాలను బతికించాను. తన తండ్రిని ఆదర్శంగా తీసుకుని అర్హులైన వారు నేత్రదానానికి ముందుకు రావాలని అన్నారు.

- నేత్రదానం..వెలుగుల గమ్యం
- చైతన్యం తెస్తున్న అంధత్వ నివారణ సంస్థ
- వ్యక్తి మరణించిన 6 నుంచి 8 గంటలలోపు నేత్రాల సేకరణ
- సత్వర సమాచారంతో ప్రయోజనం
- మొహిసిన్ ఐ బ్యాంకు ద్వారా నేత్ర సేకరణ

"ఈ ఏడాది మార్చి 7వ తేదీన అనకాపల్లి వల్లాపురం కింతలి గ్రామానికి చెందిన జి.శాలిని అనారోగ్యం కారణంగా మరణించారు. దీంతో ఆమె తండ్రి వెంటనే బ్లడ్ బ్యాంక్‌కు సమాచారం ఇచ్చి నేత్రదానం చేశారు."

మరణించినా జీవించడం నేత్రదానంతోనే సాధ్యం. మరణించిన వ్యక్తి నేత్రాలు దానం చేయడంతో చూపులేని అంధులకు వెలుగు లభిస్తుంది. అందుకే మనిషి మరణించినా.. వారి చూపులో వెలుగును నింపుదామంటూ ఐ బ్యాంక్, కంటి వైద్యులు దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు...నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం.

సాక్షి, అనకాపల్లి : వ్యక్తి మరణించిన తరువాత 6 నుంచి 8 గంటల లోపు మృతుల కంటి నుంచి రెటీనా సేకరించాలి. లేదంటే అది పనికిరాదు. జిల్లాలో అవగాహన ఉన్న వ్యక్తులు..కంటి దానం చేయడానికి ముందుకు వస్తున్నారు. అవగాహన లేనివారు నేత్రదానం చేయడానికి ముందుకు రావడం లేదు. ఒక వ్యక్తి మరణించిన తరువాత ఆయన కుటుంబంలో సంబంధిత కుటుంబ సభ్యులుగాని, వారి సన్నిహితులు గానీ అవగాహన కల్పించడం ద్వారా నేత్రదానం చేస్తారు. మరణించిన వ్యక్తి ఆత్మ శాంతించదనే అపోహల కారణంగా కొంతమంది నేత్రదానానికి ముందుకు రావడం లేదు. అలాంటి వారిలో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

25 నుంచి నేత్రదాన పక్షోత్సవాలు

గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకూ అందరికీ ఈ ఏడాది ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకూ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కంటి చూపు కోల్పోయిన వారికి కార్నియా మార్పిడి ద్వారా




కార్నియా దెబ్బతిన్న రోగి

వెలుగు ప్రసాదించడం సాధ్యమవుతుందని వైద్యులు చెబుతున్నారు. చనిపోయిన వారి నుంచి నల్లగుడ్డుపై పారదర్శకంగా ఉండే పొరను సేకరించి కంటి చూపు కోల్పోయిన వారికి చూపును అందిస్తారు. నేత్ర దానానికి వయస్సుతో సంబంధం లేదు. ముందుగా ప్రకటించకపోయినా కుటుంబ సభ్యుల అనుమతితో చనిపోయిన వారి నేత్రాలను అందించేందుకు కంటి బ్యాంకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

వీరు కూడా అర్హులే..

కళ్లద్దాలు పెట్టుకునేవారు, మధుమేహం, హైబీపీ, ఉబ్బసం వంటి వ్యాధులతో బాధపడేవారు కూడా నేత్రదానం చేయొచ్చు. కంటి శుక్లాలకు శస్త్ర చికిత్స చేయించుకున్న వారు కూడా అర్హులే. వ్యక్తి మరణించిన ఆరు గంటల లోపు నేత్రాలను సేకరించాల్సి ఉంటుంది.



నేత్రదానం చేయడం వల్ల బాగైన కన్ను

కార్నియల్ దృష్టి హీనతకు కారణాలు..

కంటికి గాయం కావడం, పోషకాహార లోపం, అంటువ్యాధి సంభవించడం, రసాయనిక చర్యల వల్ల ప్రమాదాలు, వంశపారపర్యం కారణంగా కార్నియల్ దృష్టి హీనతకు గురవుతారు. ఆపరేషన్ తరువాత కాంప్లికేషన్స్ లేదా ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఈ ప్రమాదం ఉంది.

నేతదానం ఎవరు చేయకూడదు..

ఎయిడ్స్, హెపటైటిస్–బి, రేబిస్, పాముకాటు, బ్లడ్ క్యాన్సర్, సెప్టీసిమియా వంటి వ్యాధులున్నవారు నేత్రాలు దానం చేయకూడదు. వారి నేత్రాలు పెడితే ప్రయోజనం ఉండదు.

జిల్లాలో నేత్రదాతల వివరాలు	
2022-23 మరణానంతరం నేత్రదానం చేసినవారు	51
2023-24 మరణానంతరం నేత్రదానం చేసినవారు	60
2024-25 జులై వరకు మరణానంతరం నేత్రదానం చేసినవారు	58

అవగాహన కల్పిస్తున్నాం



నేత్రదానంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నాం. చాలా వరకు మార్పు వచ్చింది. మరణించాక నేత్రదానం చేయడానికి చాలామంది ముందుకు వస్తున్నారు. నేత్రదాన ప్రక్రియలో భాగంగా కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మృతి చెందితే విశాఖలో మొహిసిన్ నేత్రనిధి కేంద్రాన్ని సంప్రదించి నేత్ర దానానికి ముందుకు రావాలి. ఎవరైనా నేత్రదానానికి అంగీకరిస్తే..వెంటనే 9246624000, 9440821919, 8977124000 నంబర్లకు కాల్ చేసి చెప్పాలని కోరుతున్నాను.

–డాక్టర్ జి.వి.రమణకుమార్, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం అధికారి

ఇసుక దోపిడీపై నిఘా

- సాక్షి కథనానికి స్పందించిన మైనింగ్ ఏడీ
- తీర ప్రాంత గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోతో కలిసి పర్యటన
- అక్రమ తవ్వకాలను నిర్ధారించిన స్థానికులు

నక్కపల్లి: మండలంలో సముద్రతీర ప్రాంత గ్రామాల నుంచి సముద్రపు ఇసుక దోపిడీ జరగకుండా నిఘా ఏర్పాటు చేస్తామని నర్సీపట్నం గనులు భూగర్భశాఖ ఏడీ రవికాంత్ తెలిపారు. నక్కపల్లి మండలంలో డీఎల్ పురం, గునిపూడి, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి సముద్రపు ఇసుకను అక్రమంగా తవ్వి రాత్రి సమయాల్లో టిప్పర్లలో తరలిస్తున్నారు. ఈ ఇసుక మాఫియాకు కొంతమంది జనసేన నాయకుల అండదండలు ఉన్నాయి. రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఈ ఇసుక అక్రమ తవ్వకాలపై ఈనెల 25న 'తీర ప్రాంతంలో సముద్రపు ఇసుక దోపిడీ' శీర్షికన సాక్షి దినపత్రికలో వెలువడిన కథనానికి ఏడీ స్పందించారు. పత్రికల్లో వచ్చిన కథనంపై స్థానిక వీఆర్వోను వివరణ కోరగా ఆరోజు తాను వేరొక పని ఉండి వెళ్లానని, అందుబాటులో లేనని సమాధానం చెప్పారన్నారు. తదుపరి తమ సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బందితో కలసి డీఎల్ పురం తదితర గ్రామాల్లో పర్యటించి ఇసుక తవ్వకాలపై ఆరా తీశామన్నారు. ఈ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో కొంతమంది సముద్రపు ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వీరి సమాచారం మేరకు ఈ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. స్థానిక వీఆర్వోకు నిఘా ఏర్పాటు చేయాలని సూచించడంతోపాటు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ, నర్సీపట్నం ఆర్డీవో, డీఎస్పీ, తహసీల్దార్, ఎస్ఐలకు ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధించాలని, ఈ విషయంలో తమకు సహకరించాలని రాతపూర్వకంగా కోరామన్నారు. సముద్రపు ఇసుక రవాణాను అడ్డుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఇసుక రవాణా చార్జీలు ఇవే..

తుమ్మపాల: ఈ నెల 28వ తేదీ నుంచి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక కావాల్సిన వారు నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. జిల్లాలో నక్కపల్లి కేంద్రంగా ఉన్న ఇసుక స్టాక్ యార్డ్‌లో ప్రస్తుతం 16,208.59 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, లోడింగ్, ఇతర ఖర్చులు కలిపి టన్ను ఇసుక ధర రూ.1,225గా నిర్ణయించారన్నారు. ఇసుక బిల్లులు డిజిటల్ రూపంలో మాత్రమే చెల్లించాలన్నారు.

ఇసుక రవాణా చార్జీల వివరాలు..

వాహనం	టన్నులు	1-10 కి.మీ.	10-20 కి.మీ.	20 కి.మీ.పైన (కి.మీ. ఒక్కంటికి)
ట్రాక్టర్	4.5	రూ.800	రూ.1,300	రూ.80
6 టైర్ గూడ్స్	10	రూ.1,600	రూ.2,200	రూ.100
10 టైర్ గూడ్స్	18	రూ.2,500	రూ.3,500	రూ.140
12 టైర్ గూడ్స్	22	రూ.3,500	రూ.5,000	రూ.180
16 టైర్ గూడ్స్	31	రూ.4,500	రూ.6,500	రూ.200

అనధికారిక వసతి గృహాలపై చర్యలు

కోటవురట్ల : అనధికారికంగా వసతి గృహాలు, ఆశ్రమాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు జానకమ్మ తెలిపారు. ఈ నెల 19న కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో ఉన్న పాసా ట్రస్ట్‌లో ఫుడ్ పాయిజనింగ్‌తో 86 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై అందులో ముగ్గురు చిన్నారులు మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనలో ట్రస్ట్‌ను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. దీనిపై ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీని వేయగా మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో, డీఎస్పీ, డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్‌మెంట్ ఆఫీసర్, డీఈవో, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ ఆఫీసర్ సభ్యులు కాగా ఆర్డీవోకు బదులు తహసీల్దారు జానకమ్మ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో చికిత్స



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు జానకమ్మ

అనంతరం కోలుకున్న 83 మంది విద్యార్థుల ఆరోగ్యంపై వివరాలు తెలుసుకున్నారు. వారికి ఇంకా వైద్య పరంగా ఏమైనా చర్యలు తీసుకోవాలా.. అన్న అంశంపై ఆరా తీశారు. పిల్లలందర్నీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనధికారంగా ఉన్న వసతి గృహాలను మూసివేయిస్తామని, దీనిపై విచారణ చేస్తున్నామని తహసీల్దారు తెలిపారు.

భూ వివాదంలో వృద్ధుడి హత్య

- అన్నదమ్ముల మధ్య ఘర్షణ
- సర్దిచెప్పడానికి వచ్చిన చిన్నాన్న హతం

మాకవరపాలెం: భూ వివాదం నేపథ్యంలో జరిగిన ఘర్షణ ఒకరి హత్యకు దారితీసింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడపాలకు చెందిన అన్నదమ్ములు గనిశెట్టి దొరబాబు, భాస్కరరావుల మధ్య కొంతకాలంగా భూవివాదం నలుగుతోంది. సోమవారం రాత్రి ఇంటి స్థలం గురించి మళ్లీ గొడవ పడ్డారు. తన ముందే అన్న కొడుకులు తగాదా పడుతున్నారని చిన్నాన్న గనిశెట్టి జోగినాయుడు (72) వారి మధ్యకు వెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దొరబాబు చిన్నాన్న జోగినాయుడిపై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణారావు గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.



హత్యకు గురైన జోగినాయుడు

గత కొంత కాలం నుంచి వీరి మధ్య భూ వివాదం ఉందని, ఈ హత్యకు పాత కక్షలే కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చిన్నాన్నను హత్య చేసిన దొరబాబును మంగళవారం అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ హరి విలేకరులకు తెలిపారు.

ఈవో గంగారావు సస్పెన్షన్

నర్సీపట్నం: నర్సీపట్నం మరిడమ్మ ఆలయ పూర్వ ఈవో ఎస్.గంగారావును సస్పెండ్ చేసినట్లు జిల్లా దేవదాయశాఖ అధికారి రాజారావు తెలియజేశారు. మరిడమ్మ వారికి సంబంధించిన 33 తులాల బంగారు హారం నకిలీదిగా నిర్ధారణ కావడంతో ఆలయ పూర్వ ఈవోను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశామని కమిషనర్ తెలిపారు. మరిడమ్మవారి బంగారు హారం స్థానంలో నకిలీ హారం రావడంపై నిగ్గు తేల్చాలని టీడీపీ నాయకుడు చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు. దేవదాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని విలేకరులతో అన్నారు.

80 రోజుల్లో 4 ప్రమాదాలు

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొరవడిన నిఘా
- సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి: ఫార్మా కంపెనీలలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్దదని, కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీల శాఖ, అగ్నిమాపక శాఖల నుంచి స్పందనే కరువయ్యిందని విమర్శించారు. జిల్లాలోని ఎస్ఈజెడ్‌లలో ప్రమాదకరమైన 138 ఫార్మా పరిశ్రమలు ఉన్నాయని, వీటిలో 40 వేల మంది కార్మికులు విధులు నిర్వహిస్తుండగా, మిగతా పరిశ్రమలలో మరో 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 80 రోజుల్లో అనకాపల్లి జిల్లాలో 4 ప్రమాదాలు జరిగాయని, రాష్ట్రంలో అనేక ప్రైవేటు పరిశ్రమల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు.

ఎంటీబీఈ.. బీ అలెర్ట్!

- ఎసైన్షియాలో ప్రమాదానికి మిథైల్ టెర్ట్– బ్యుటైల్ ఈథర్ లీకేజీ కారణం
- ఎంటీబీఈ తయారీ పరిశ్రమల్లో భయాందోళనలు
- విధులు నిర్వర్తించేందుకు జంకుతున్న ఉద్యోగులు
- మాక్ డ్రిల్ నిర్వహణకు ఎంటీబీఈ తయారీ పరిశ్రమలు సన్నాహాలు
- ఉద్యోగులు, కార్మికులకు భద్రతా ప్రమాణాలపై శిక్షణ


సాక్షి, విశాఖపట్నం : ఫార్మా పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు ఉద్యోగులు, కార్మికులు, స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. జనావాసాల మధ్య ఏర్పాటైన పరవాడ ఫార్మాసిటీతో పాటు అచ్యుతాపురం సెజ్‌లో కలిపి 200కి పైచిలుకు ఫార్మా పరిశ్రమలున్నాయి. వీటిలో సుమారు 50 వేల మంది పని చేస్తున్నారు. మండే స్వభావం గల సంస్థల్లో అధికారులు తనిఖీలు సరిగ్గా చేపట్టకపోవడంతో భద్రతా ప్రమాణాలపై పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఔషధ ఉత్పత్తుల తయారీలో కీలక యంత్రాలైన రియాక్టర్లు ఒత్తిడికి గురై పేలుడు సంభవిస్తే, ఆ ప్రమాద తీవ్రత భయంకరంగా ఉంటుంది. పేలుడు ధాటికి అధిక ఉష్ణోగ్రతతో మండుతున్న రసాయనాలు బయటకు చిమ్మడం, దట్టమైన పొగలు, మంటలు చెలరేగడంతో అక్కడ పనిచేస్తున్న వారు అగ్నికీలల్లో కాలిపోయో, శ్వాస ఆడకనో మృత్యుఒడికి చేరుతున్నారు. వీరిపై ఆధారపడ్డ కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయి.

ఎంటీబీఈ.. వెరీ డేంజర్ !

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి ప్రధాన కారణం మిథైల్ టెర్ట్– బ్యుటైల్ ఈథర్ (ఎంటీబీఈ) తయారు చేస్తున్నప్పుడు లీకేజీయే. ఎంటీబీఈ అంటే కర్బన సమ్మేళనం. మనం సిరప్‌లు తాగుతున్నప్పుడు వివిధ రకాల ఫ్లేవర్లు వస్తుంటాయి కదా.. ఆ ఫ్లేవర్ల



కోసం ఎంటీబీఈని ఉత్పత్తి చేస్తుంటారు. మిథనాల్, ఐసోబ్యుటిలీన్ రసాయన చర్య ద్వారా దీన్ని ఉత్పత్తి చేస్తుంటారు. అమెరికాలో రోజుకు 10 వేల బ్యారెల్స్ వరకూ దీన్ని తయారు చేస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 35 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎంటీబీఈ ఉత్పత్తవుతుంటుంది. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ఎసైన్షియాలో 500 లీటర్ల ఎంటీబీఈని ఉత్పత్తి చేస్తున్నారు. సిరప్‌లతో పాటు పిత్తాశయంలో ఏర్పడే రాళ్లని కరిగించేందుకు వాడే మందుల్లోనూ ఎంటీబీఈని వినియోగిస్తుంటారు. ఇది ఆవిరి రూపంలో ఉత్పత్తవుతుంది. దీన్ని రియాక్టర్ల ద్వారా ద్రవరూపంలోకి మార్చుతుంటారు. ఇది రంగులేని ద్రావకం. ఎంటీబీఈలో ఆక్సిజన్ శాతం అత్యధికంగా ఉంటుంది కాబట్టి.. మండే స్వభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇది చాలా డేంజర్‌గా పరిగణిస్తుంటారు. ఇది పండ్ల వాసన వస్తోంది.



పలు పరిశ్రమల్లో ఎంటీబీఈ

ఎసైన్షియాతో పాటు సెజ్‌లోని పలు పరిశ్రమలు ఎంటీబీఈని తయారు చేస్తున్నాయి. దీంతో ఆయా పరిశ్రమల్లోని ఫార్మా ఉద్యోగులు, కార్మికులు భయాందోళనలకు గురవుతున్నారు. తయారీ బ్లాక్‌లోనే కాదు ఆ కంపెనీకి వెళ్లాలన్నా జంకుతున్నారు. ఆ పరిశ్రమలో ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడిపోతుందనే ఆందోళన వారిలో మొదలైంది. ఎసైన్షియా ప్రమాద ప్రభావం మిగతా ఫార్మా పరిశ్రమలపై పడింది. కొందరు ఉద్యోగులు, కార్మికులు వివిధ కారణాల పేరుతో సెలవులు పెడుతున్నారు. దీంతో ఫార్మా ఉత్పత్తులు మందగించినట్లు తెలుస్తోంది.

మాక్ డ్రిల్‌కు సన్నాహాలు

ఉద్యోగులు, కార్మికుల సెలవుల్లో ఉండపోవడం, ఉత్పత్తికి విఘాతం కలగడంతో పరిశ్రమల యాజమాన్యాలు అప్రమత్తమయ్యాయి. వారిలో భయాందోళనలు తొలగించేందుకు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాయి. ముఖ్యంగా ఎంటీబీఈ ఉత్పత్తవుతున్న పరిశ్రమలు భద్రతా ప్రమాణాలపై దృష్టిసారించాయి. తమ కంపెనీలో ఉత్పత్తవుతున్న ఎంటీబీఈ యూనిట్ పూర్తిగా సురక్షితమని.. నిర్భయంగా విధులకు హాజరవ్వొచ్చు అంటూ వారిలో ధైర్యాన్ని నూరిపోస్తున్నాయి. అదేవిధంగా ప్రమాదవశాత్తూ చిన్న చిన్న లీకేజీలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలి.. దాని నుంచి ఎలా అధిగమించాలనే అంశాలపై ప్రతి కార్మికుడికీ అవగాహన ఉండేలా మాక్ డ్రిల్ నిర్వహించేందుకు ఎంటీబీఈ తయారీ ఫార్మా పరిశ్రమలు సిద్ధమవుతున్నాయి. అలాగే ఉద్యోగులు, కార్మికులకు భద్రతా ప్రమాణాలపై శిక్షణ అందించనున్నాయి. భవిష్యత్తులో ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందించే వ్యవస్థను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

పోలీసు రక్షణ పెంచాలి



ప్రభుత్వ వైద్యశాలల వద్ద పోలీసు రక్షణను మరింతగా పెంచాలి. అప్పుడే వైద్య సిబ్బంది నిర్భీతిగా విధులను నిర్వర్తించుకునే వీలుంటుంది. కోల్‌కతా దుర్ఘటన దేశంలో మరెక్కడా చోటుచేసుకోకుండా అన్ని ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్య సిబ్బంది పట్ల ఇటు రోగులు, అటు సిబ్బంది గౌరవంగా నడుచుకోవాలి. వైద్య సిబ్బంది పట్ల కఠువుగా వ్యవహరించడం తగదు.

– డాక్టర్ ప్రదీప్‌కుమార్, వైద్యుడు, గవరవరం పీహెచ్‌సీ, చోడవరం మండలం



సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి



రాత్రి సమయంలో ప్రమాదాలకు గురై మద్యం సేవించి పీహెచ్‌సీకి వస్తుంటారు. వాళ్లు మనం చెప్పింది వినరు. వారికి వైద్యం చేయాలంటే ఎంతో భయంగా ఉంటోంది. ఇక్కడ రాత్రి సమయంలో వాచ్‌మన్ కూడా లేడు. పీహెచ్‌సీ వద్ద రాత్రి సమయంలో రోగులకు మెరుగైన వైద్యం చేయడం కోసం సిబ్బందికి పూర్తిగా సెక్యూరిటీ కల్పించాలి. మరొక వాచ్‌మన్‌ను నియమించాలి.

– సిహెచ్. రాములమ్మ, స్టాఫ్ నర్సు, పాయకరావుపేట పీహెచ్‌సీ

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

- డీఈవో వెంకటలక్ష్మమ్మ



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కోటవురట్ల: విద్యార్థుల ఆరోగ్యం, విద్య పట్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ ఆదేశించారు. స్థానిక ఎమ్మార్సీని ఆమె మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. మండలంలోని పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య, వసతి గృహాల వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని సూచించారు. వంటశాలలు, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెరుగైన ఫలితాలు రాబట్టాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వసతి గృహాలను సందర్శించి అక్కడి పరిస్థితులపై నివేదిక ఇవ్వాలన్నారు. ఎంఈవో–1,2 రామారావు, శ్రీజోష్ పాల్గొన్నారు.

కష్టపడి చదివి సివిల్స్ సాధిస్తా

- ట్రిపుల్ ఐటీ విద్యార్థిని హేమలతకు ఘన సన్మానం



హేమలతను సన్మానిస్తున్న హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది

రోలుగుంట: కష్టపడి చదివి సివిల్స్ సాధిస్తానని టెన్త్‌లో మండల టాపర్‌గా నిలిచి, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని కసిరెడ్డి హేమలత అన్నారు. మండలంలోని బి.బి.పట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆమెను హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. తన తండ్రి దేముడునాయుడు జ్ఞాపకార్థంగా మాజీ సర్పంచ్ తాడి రమేష్ హేమలతకు రూ.5,116 అందజేసి, జ్ఞాపిక బహూకరించారు. హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించి రూ.20 వేలు అందజేశారు.

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక రేపు

మహారాణిపేట(విశాఖ): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈనెల 29న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో మధ్యాహ్నం 12.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేవల్ బేస్‌కు వెళ్తారు. 12.45 నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు నేవల్ బేస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. కొద్ది సేపు విశ్రాంతి తీసుకొని మధ్యాహ్నం 3.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో తిరువనంతపురం వెళ్తారు.

జై జనార్దనా కృష్ణ రాధికా పతే..



కశింకోటలోని వేణుగోపాలస్వామి మూలమూర్తి అలంకరణ



పండ్లు, పూలతో స్వామి వేదిక అలంకరణ



కల్యాణి భాగవతార్ హరికథా గానం



సింహాచలంలో శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



గోవుకి పూజలు నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

వేడుకగా వైష్ణవి కృష్ణాష్టమి

కశింకోట: జై జనార్దనా కృష్ణ రాధికా పతే.. జన విమోచనా కృష్ణ జన్మ మోచనా.. గరుడ వాహనా కృష్ణ గోపికా పతే.. అంటూ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి భక్తులు ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణుని జననం, బాలకృష్ణుని ఊయల సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా యాపిల్, దానిమ్మ, బత్తాయి, కొబ్బరి గుత్తెలతో అందంగా స్వామివారిని అలంకరించారు. చుట్టూ అరటి గెలలు ఏర్పాటు చేసి బాలకృష్ణునికి వివిధ రకాల మిఠాయిలు, పంచదార చిలుకలు నివేదించి సంప్రదాయంగా పూజలు చేశారు. ఆలయంలో ప్రధాన మూల విరాట్ వేణుగోపాలస్వామిని పూలమాలలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లికి చెందిన కల్యాణి భాగవతార్‌తో శ్రీకృష్ణ అవతారంపై హరికథా కాలక్షేపాన్ని నిర్వహించారు. ఇది ఆహూతులను అలరించింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

సింహగిరిపై వేడుకగా శ్రీకృష్ణాష్టమి

సింహాచలం: సింహగిరిపై మంగళవారం శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని విశేషంగా జరిపారు. ఆండాళ్లమ్మవారి ఉత్సవమూర్తిని దేవకీదేవిగా అలంకరించి పల్లకిలో ఉంచి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ జననోద్ధారణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. బాలకృష్ణుడికి బేడా తిరువీధి నిర్వహించారు. ఆస్థాన మండపంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారుల చెంతన బాలకృష్ణున్ని ఉంచి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, వేదపండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని జరిపించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఆలయ రాజగోపురం వద్ద ఉట్ల సంబరాన్ని నిర్వహించనున్నారు.

గోశాలలో కృష్ణాష్టమి పూజలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం శ్రీకృష్ణాష్టమిని విశేషంగా నిర్వహించారు. గోశాలలో ఉన్న శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద అర్చకులు పూజలు చేశారు. గోశాలలో ఉన్న గోవులకు పూజలు నిర్వహించారు.

సీఎల్‌ఎస్ యాప్‌లో పంటల తెగుళ్ల నమోదు

- ఆత్మ పీడీ ఆశాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ ఆశాదేవి

అనకాపల్లి: గ్రామీణ స్థాయి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయి పొలాల పరిశీలనలో తప్పనిసరిగా సీఎల్‌ఎస్ యాప్‌లో పంటల తెగుళ్లను నమోదు చేసుకోవాలని ఆత్మ పీడీ ఎం.ఆశాదేవి తెలిపారు. మండల రైతు సేవా కేంద్రం, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, ఆత్మ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాల్లో డివిజన్ స్థాయి క్రాప్ లైఫ్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలో వచ్చిన పురుగులు, తెగుళ్ల వివరాలు సీఎల్‌ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆత్మ పథకం ద్వారా జిల్లాలో వ్యవసాయ డివిజన్‌ల్లో ఈ క్రాప్ లైఫ్ సిస్టంపై ముందుగా వ్యవసాయ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. మొక్కజొన్న పంటలో పొగాకు లద్దె పురుగు వంటివి వ్యాప్తి చెందితే రైతులకు తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు. ఆర్ఏఆర్ఎస్ వ్యవసాయ చెరకు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త వి.గౌరీ మాట్లాడుతూ మన ప్రాంత భూమిలో జింకు బరన్, మెగ్నీషియం వంటి పోషక లోపాలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వీటిపై అవలంబించాల్సిన పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చెరకు, వరి, వేరుశనగ పంటల్లో పోషకాల లోపాలను తెలుసుకోవాలన్నారు. ప్రతి పంటకు 17 రకాల పోషకాలు కావాలన్నారు. వాటిని వివిధ రకాల ఎరువుల రూపంలో అందజేయాలని సూచించారు.

జిల్లా ఉద్యానశాఖ ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ వనరుల కేంద్రం ద్వారా వివిధ మండలాల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు గురించి త్వరలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. అనకాపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు రైతు సేవా కేంద్రంలో ఈ– పంట నమోదు కార్యక్రమం తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, మండల వ్యవసాయ విస్తీర్ణాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

శిశు విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

మద్రిపాలెం: శిశు విక్రయాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. మద్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలోని శిశు గృహ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఇటీవల శిశువులను విక్రయిస్తున్న ముఠాను నగర పోలీసులు పట్టుకుని.. వారి నుంచి 9 మంది చిన్నారులను స్వాధీనం చేసుకుని శిశు గృహలో చేర్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసలి అప్పారావు శిశు గృహను సందర్శించి.. పిల్లల ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్న పిల్లల విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, సచివాలయ సిబ్బంది, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ, విద్యా శాఖకు ఆదేశాలు చేస్తామన్నారు. శిశు కేంద్రాన్ని సచివాలయ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్తలు తరచూ సందర్శించాలని సూచించారు. చట్టపరమైన దత్తతపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.వి.రమణకుమారి, శిశు గృహ మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ ఎస్.వి. రామలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

పాత పింఛను అమలు చేయకపోతే పోరాటం

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ధర్మారావు, దుర్గా ప్రసాద్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

బుచ్చెయ్యపేట: ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయకపోతే రోడ్డెక్కి పోరాటాలు చేయడానికి సిద్ధమవుతామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.ఎల్.ఎన్ ధర్మారావు, ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గా ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం బుచ్చెయ్యపేటలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్)కు గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ఆమోదించిన గ్యారంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్)కు తేడా లేదన్నారు. పాత పెన్షన్ విధానం కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తుంటే, ఇప్పుడు యూపీఎస్ పేరుతో మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వ చర్యలను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కల్లబొల్లి కబుర్లతో సమయాన్ని వృథా చేయకుండా పాత పింఛన్ విధానాన్ని లక్షలాది మంది ఉద్యోగులకు అమలు చేయాలన్నారు. లేకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులను చైతన్యపరిచి తమ డిమాండ్ల సాధనకు కార్యాచరణ ప్రకటించి పోరాటాలు చేయడానికి వెనకాడబోమన్నారు.

పారా అథ్లెట్ రవి గెలుపొందాలని ఆకాంక్ష

అనకాపల్లి: పారిస్‌లో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ నిర్వహించే పారా ఒలింపిక్స్ క్రీడల్లో కె.కోటపాడుకు చెందిన అథ్లెట్ రొంగలి రవి షాట్‌పుట్ విభాగంలో బంగారు పతకం సాధించాలని నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూర్‌లో శిక్షణ పొందిన రవి గతంలో అనేక అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు కైవసం చేసుకున్నాడన్నారు. ఈ సారి బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు.

లారీ ఢీకొట్టడంతో క్లీనర్ మృతి

మల్కాపురం: తాను పని చేస్తున్న లారీయే అతని పాలిట మృత్యువైంది. లారీ ఢొన్న ప్రమాదంలో క్లీనర్ మృతి చెందాడు. ఈ ఘటనపై మల్కాపురం పోలీసులు వెల్లడించిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు గ్రామానికి చెందిన కింతాడ కృష్ణ తన కుటుంబంతో నివసిస్తున్నాడు. శ్రావణ్ షిప్పింగ్ నుంచి లోడ్లు తీసుకువెళ్లే లారీలో క్లీనర్‌గా పని చేస్తున్నాడు. డ్రైవర్, సబ్బవరం ప్రాంతానికి చెందిన సూరినాయుడుతో కలిసి సోమవారం లారీలో లోడు వేసుకుని, ఆర్‌సీఎల్ వద్ద లోడ్ అన్‌లోడ్ చేసేందుకు వెళ్లాడు. అక్కడ లారీని వరస క్రమంలో పెట్టడానికి.. లారీ వెనుక నుంచి కృష్ణ డ్రైవర్‌కు సూచనలిస్తున్నాడు. అయితే.. డ్రైవర్ కృష్ణను గమనించలేదో లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించాడో తెలియదు గానీ.. లారీ వెనుక నుంచి కృష్ణను ఢీ కొట్టింది. వెనుక చక్రం కృష్ణ నడుం భాగంపై నుంచి వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీంతో యాజమాన్యం బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించేందుకు అంగీకరించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళవారం కేజీహెచ్‌కు తరలించారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్యామలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■విజయవాడ to హైదరాబాద్ హైవే ఫేసింగ్ కమర్షియల్ ల్యాండ్ 4 ఎకరాలు కలదు. ఐకానిక్ బ్రిడ్జికి 300మీటర్స్‌లో కోర్‌క్యాపిటల్ అమరావతికి 7కి.మీ దగ్గరలో. సంప్ర: 93477 56501. [N-1237205]

PLOT FOR SALE

■BHPV దరి రెడ్డి తుంగ్లంలో 86 గజాలు తూర్పు ఫేసింగ్ బిట్టు రెడీగా ఇల్లు కట్టుకొనుటకు ఉన్న బిట్టు అమ్మకంనకు కలదు. ఫోన్: 81437 11910 [V- 780441]

■VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ॥గ॥ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: ✆ 91218 84889 [B-62]

■6 లక్షలకే 111 గజాలు, GVMC 77 వార్డు పరిధిలో 130 బిట్లు. ఇల్లులు, బస్సులు, రైతుబజారు, షాప్‌లు, వాటర్, ఎలక్ట్రికల్ అన్ని కలవు. ఫోన్ : 73864 14017 [V- 786932]

Wanted

■ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను.Qul:-10th-డిగ్రీ,sal: 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 90306 12463 [G-9013]

■విశాఖపట్నంలో గల ఒక ప్రముఖ కేటరింగ్ సంస్థలో పనిచేయుటకు అనుభవం గల బిరియాని మాస్టర్లు కావలెను. ఫోన్: 98487 09850, 91828 28978 [V- 2674]

■ప్రముఖ హెల్త్ కంపెనీలో జిల్లా వ్యాప్తంగా పనిచేయుటకు టీం లీడర్స్ కావలెను. నో సేల్స్, నో టార్గెట్స్, ప్రతి నెల 15 వేలు నుంచి 30 వేలు వరకు సంపాదించవచ్చు. పూర్తి వివరాలకు కాల్ : 89782 49141 [V- 120105]

■ప్రైవేట్ మినీ బ్యాంకులలో పని చేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. స్థలం: అనకాపల్లి విశాఖపట్నం. సెల్: 9704013331. [W-1239904]

Services

GOLD LOANS

■లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

విలేకరిపై టీడీపీ నాయకుడి దాడి

బుచ్చెయ్యపేట : మండల కేంద్రం బుచ్చెయ్యపేట నాల్గు రోడ్ల జంక్షన్‌లో ఆంధ్రప్రభ విలేకరి వియ్యపు నాగరాజుపై టీడీపీ నేత దాడి చేసి గాయపరిచాడు. బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెంకు చెందిన విలేకరి నాగరాజు తన గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడితో కలిసి మంగళవారం సాయంత్రం బుచ్చెయ్యపేట నాలుగురోడ్ల జంక్షన్‌లో టీ తాగారు. ఇంటికి రావడానికి ఇద్దరు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఇదే గ్రామానికి చెందిన వార్డు మెంబర్ భర్త టీడీపీ నాయకుడు వియ్యపు రామారావు ద్విచక్ర వాహనంపై తాగి వచ్చి నీవు మా టీడీపీ నాయకుల ద్విచక్ర వాహనంపైనే కూర్చొంటావా.. విలేకరివి అయితే ఏమిటి గొప్ప.. అంటూ రాయలేని విధంగా దుర్భాషలాడుతూ చొక్కా కాలర్ పట్టుకుని నాగరాజుపై దాడి చేశాడు. నీ దిక్కు ఉన్న చోట చెప్పుకోరా అంటూ కింద పడేసి పిడిగుద్దులతో నాగరాజుపై దాడి చేశాడు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న కొంతమంది రామారావును అడ్డగించారు. తాగి వచ్చి దాడి చేయడంపై రామారావును మందలించారు. తనపై అమానుషంగా దాడి చేసిన రామారావుపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విలేకరి నాగరాజు బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇది తనపైనే జరిగిన దాడి మాత్రమే కాదని మీడియాపై జరిగిన దాడి అని నాగరాజు వాపోయాడు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులు విచారణ చేస్తున్నారు.

వృత్తి పనే ఊపిరి తీసింది

- కొబ్బరిచెట్టుపై జారపడి కూలీ మృతి



మృతుడు దుర్గారావు

చోడవరం రూరల్: పొట్టకూటి కోసం ఎంచుకున్న వృత్తిపనే అతని ఆయుష్షు తీసింది. కొబ్బరి చెట్టు ఎక్కి బోండాలు తీయడం, కొబ్బరి కాయలు ఒలుపు వంటి పనులు చేసుకుని వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే కోనాల దుర్గారావు(52) మంగళవారం ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. పట్టణ సమీపంలోని గాంధీగ్రామం శివారు సిటిజన్ కాలనీకి చెందిన దుర్గారావుకు భార్య వెంకటలక్ష్మి, పిల్లలు పద్మరాజు, సంధ్యారాణి ఉన్నారు. ఎప్పటిలాగానే కొబ్బరి చెట్టు ఎక్కిన అతడు పట్టుతప్పి జారిపడిపోయాడు. కిందపడి తీవ్రంగా గాయపడిన దుర్గారావును చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. చోడవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



సారా తయారీకి ఉపయోగించే పాత్రలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామ సమీపాన నది ఒడ్డున సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించామని ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. గజపతినగరం గ్రామానికి చెందిన రాయి గోపిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు చోడవరం క్రీడాకారులు

- జిల్లా స్థాయి పోటీల్లో ఏడుగురికి బంగారు పతకాలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన యోగా క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం: జిల్లా స్థాయి యోగా పోటీల్లో చోడవరం యోగా క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు మంగళవారం అభినందించారు. ఈ నెల 26వ తేదీన పరవాడలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో చోడవరం పతంజలి యోగా కేంద్రం క్రీడాకారులు పలు విభాగాల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గూనూరు పద్మజ, కొట్టాపు హరికిరణ్, పొట్నూరి పవన్‌కుమార్, గొంతిన లయవర్ధన్, వేపాడ పూర్ణచంద్రరావు, పుల్లేటి క్రాంతిసాగర్, చింతాడ హర్షవర్ధన్ బంగారు పతకాలు సాధించారు. వీరంతా త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అనకాపల్లి జిల్లా నుంచి ఎంపికయినట్టు ఏపీ యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లేటి సతీష్ తెలిపారు.

త్వరలో మరో 14 సూపర్ లగ్జరీ బస్సులు



మధురవాడ డిపోలో కొత్త సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస: జిల్లాలకు కేటాయించిన 34 సూపర్ లగ్జరీ బస్సులకు గాను 20 బస్సులు వచ్చాయని.. త్వరలో మరో 14 బస్సులు రానున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మధురవాడ డిపో నుంచి ఒక్కొక్కటి రూ.42 లక్షల విలువైన 5 బస్సులను ప్రారంభించారు. వీటిలో హైదరాబాద్(బెల్‌కు)–2, భీమవరం, ప్రొద్దుటూరు, విజయవాడకు ఒక్కో బస్సు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బస్సులు, కొత్త బస్ రూట్ల కోసం వచ్చిన వినతులపై అధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీటీవో ఎ.అప్పలరాజు, డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు, మధురవాడ, విశాఖ, మద్దిలపాలెం డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనకాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నీటి పారుదల శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఐదు నెలల బకాయిలు తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ వర్కర్లకు బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. పంపు ఆపరేటర్లు, వాల్ ఆపరేటర్లు, వాచ్‌మెన్, ఎలక్ట్రీషియన్లకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఏజెన్సీకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, జిల్లా యంత్రాంగం కల్పించుకుని సంపతపురం ప్రాజెక్టులోని కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు వెంటనే అందించే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో వందలాది మంది ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడం లేదన్నారు. జీతాలు చెల్లించని పక్షంలో సమ్మెకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.త్రినాథరావు, ఎర్రయ్య, అప్పారావు, ఆనంద్, మణికంఠ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాలకు నిలయం.. రైవాడ జలాశయం

ప్రకృతి అందాలతో రైవాడ జలాశయం కనువిందు చేస్తోంది. ఇక్కడ పరిసరాలలో ఎగువున పచ్చని కొండలు, దిగువున పచ్చని పొలాల నడుమ ఆవిష్కృతమైన ఎన్నో రమణీయ దృశ్యాలు ప్రకృతి ప్రేమికుల మనస్సును దోచుకుంటున్నాయి. ఆకాశంలో నీలి రంగు మబ్బులు జలాశయం నీటిని తాకినట్లు అద్భుత దృశ్యాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఒకవైపు జలాశయంలో మత్స్యకారులు బోటుపై చేపల వేట సాగిస్తుండగా... మరో వైపు కొంగలు, ఇతర పక్షులు విహరిస్తున్న సుందర దృశ్యాలు మైమరిపిస్తున్నాయి.

– దేవరాపల్లి



నీలిరంగు మబ్బుల వెలుగులో బోటుపై చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుడి సుందర దృశ్యం



రైవాడ జలాశయంపై విహరిస్తున్న కొంగలు, ఇతర పక్షులు

క్లుప్తంగా

యాప్‌ల పనిభారం తగ్గించాలని వినతి

అనకాపల్లి: ఉపాధ్యాయులపై వివిధ యాప్‌ల పని భారం తగ్గించి, విద్యార్థుల బోధనకు పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. మంగళవారం కె.ఎస్.ఆర్.పేట జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తొలగించిందన్నారు. ఈ బాధ్యతను ఎస్ఎంసీ కమిటీకి, గ్రామ సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు అప్పగించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మీ, సీనియర్ నాయకులు స్వామి, అలివేలు, అప్పారావు, సతీష్, రాజునాయుడు, దేముడు నాయుడు, బాబూరావు, రవి, తేజ్ వర్ధన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు



జయశ్రీకి సర్టిఫికెట్ అందజేస్తున్న బాబి

అనకాపల్లి: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ యోగా సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం తుమ్మపాలలో విద్యార్థులకు జిల్లా స్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. 10–14, 40–50 ఏళ్ల విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు బాబి మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వివిధ రకాల వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. మానసిక ఒత్తిడికి గురవుతున్న సమయంలో యోగా శరీరానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల యోగా గురువు కొండలరావు, సభ్యులు పన్నీరు చంటి, కర్రి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభం

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. ఎంకాం, ఎంఎస్సీ (కామర్స్, కెమిస్ట్రీ),ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు ఈ నెల 28వ తేదీ లోపు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 68 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,350	4,950
రెండో రకం	3,750	3,900
మూడోరకం	3,000	3,360

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/r కాదల్	: రాజా(మార్నింగ్, మాట్నీ)
త్రిల్లర్ అండ్ చిల్స్	: రాజా(ఫస్ట్‌షో, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
మారుతీనగర్ సుబ్రమణ్యం	: షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
11 డిమోంటి కాలనీ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి టౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య (9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి టౌన్: ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 411 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని దారుణంగా హత్య చేయడం శోచనీయం. ఇటువంటి సంఘటనలు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఇందుకు కారకులైన నిందితులను ఇప్పటికీ శిక్షించకుండా తాత్సార్యం చేయడం ఎంత వరకు సమంజసం. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి ఇప్పటికైనా పటిష్టమైన రక్షణ కల్పించడానికి చర్యలు చేపట్టాలి.

– కె.బి.ఎన్. శ్రీదేవి, ఎంపీహెచ్ఏ, పీహెచ్‌సీ, కశింకోట

మానవ మృగాళ్లను ఉరి తీయాలి



వైద్యులపై దుశ్చర్యలకు పాల్పడే మానవ మృగాళ్లను బహిరంగంగా ఉరి తీయాలి. ప్రజల ప్రాణాల కోసం 24 గంటలపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే రక్షణ లేని సమాజంలో వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రభుత్వంలోని పెద్దలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు అమలు చేయాలి.

– జాజుల సుమతి, ఏఎన్ఎం, 6వ సచివాలయం, అనకాపల్లి

– అనకాపల్లి, తుమ్మపాల

వర్షపు నీటి పాలైన రూ.30 లక్షలు



చెరువును తలపిస్తున్న అనకాపల్లి–చోడవరం రోడ్డు

అనకాపల్లి–చోడవరం రోడ్డు మరమ్మతులకు వెచ్చించిన రూ.30 లక్షలు వర్షపు నీటి పాలయ్యాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డును కంకర, క్రషర్ బుగ్గితో బాగు చేసిన కూటమి నాయకులు విపరీతమైన ప్రచారం చేసుకున్నారు. ఇది బాగు చేసిన 20 రోజులకే అదంతా కొట్టుకుపోయింది. దాంతో షరామామూలే అన్నట్టుగా గోతులు ప్రత్యక్షమై వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

- కొట్టుకుపోయిన కంకర, క్రషర్ బుగ్గి
- మరమ్మతులు చేసిన 20 రోజులకే గోతులు
- చెరువును తలపిస్తున్న అనకాపల్లి–చోడవరం రోడ్డు
- కూటమి ప్రభుత్వ తీరుపై ప్రయాణికుల అసహనం



రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలు



రోడ్డుపై నీటిని మోటార్‌తో తోడుతున్న యువకులు



చినబాబుకాలనీ వద్ద గోతుల్లోంచి ప్రయాణిస్తున్న వాహనాలు



చెరువును తలపిస్తున్న రోడ్డు

తుమ్మపాల: మండలంలో 2019 ఎన్నికలకు ముందు రోడ్లన్నీ అత్యంత దారుణంగా అధ్వానంగా ఉండేవి. వీటిని మరో పదేళ్లయిన పాడవకుండా ఉండేవిధంగా గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ చొరవ తీసుకుని అత్యధిక నిధులతో నిర్మించారు. ఏజెన్సీ నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ చేరుకునే కేటీ రోడ్డును గతంలో ఎన్నడూ లేనంతగా డబుల్ లేయర్ కాంక్రీటుతో చరిత్రతో నిలిచిపోయేలా నిర్మించారు. మారేడుపూడి ప్రధాన రహదారి, మామిడిపాలెం – మాకవరం రహదారి, మార్టూరు – మాకవరం రహదారి, గోపాలపురం నుంచి పరవాడ మండలంలోకి రహదారి, కోడూరు – కొండుపాలెం రహదారి, ఇలా చాలానే రోడ్లను పటిష్టంగా నిర్మించి శాశ్వత పరిష్కారం చూపారు. వీటిపై హాయిగా ప్రయాణించే మండల ప్రజల్లో అత్యధికులు కొత్త నాయకుడొస్తే ఇంకేదో చేసేస్తాడనే ఆశతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతిచ్చి ఎమ్మెల్యేగా కొణతాల రామకృష్ణను గెలిపించారు. అయితే శాశ్వత రోడ్ల అభివృద్ధికి బదులు తాత్కాలిక మరమ్మతులతో రోడ్లపై గోతులు పూడ్చి చేతులు దులుపుకుంటున్న కూటమి నాయకుల వైఖరిపై ఇప్పుడు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కంకర, క్రషర్ బుగ్గితో పూడ్చిన గోతుల్లో నీరు

ఎన్నికల్లో పాడైన రోడ్లను బూచిగా చూపి వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం చేసి గెలిచిన కూటమి ప్రభుత్వం మూడు నెలలుగా సమీక్షలతోనే సరిపెడుతోంది. గ్రామాల్లో ప్రజలు వ్యక్తిగత పనులపై పట్టణాలకు రాకపోకలు చేయాలంటే అధ్వాన రోడ్లు బాగుచేయాలని, లేదంటే వారికేమీ సమాధానం చెప్పాలని కూటమి కార్యకర్తలు ఎమ్మెల్యే కొణతాలపై ఒత్తిడి తీసుకొచ్చారు. దాంతో అనకాపల్లి–చోడవరం రోడ్డుకు 20 కిలోమీటర్ల మేర రూ.30 లక్షలు ఖర్చు చేసి కంకర, క్రషర్‌తో గోతులు పూడ్చి చేతులు దులుపుకున్నారు. 20 రోజుల క్రితం చేపట్టిన పనులకు కూటమి నాయకులు విపరీతమైన ప్రచారం చేసుకున్నారు. తీరా చూస్తే మూడు వారాలకే పూడ్చిన గోతులు చెరువుల్లా తయారయ్యాయి. భారీ గోతుల్లో ప్రయాణం ప్రమాదంగా మారడంతో స్థానికులు రోడ్డుపై ముళ్లకంపలు వేసి ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచిస్తున్నారు.

క్రషర్ బుగ్గి ఎగిరిపోయి, రాళ్లు తేలిపోయి...

మండలంలో అనకాపల్లి–చోడవరం రోడ్డు పది కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నిత్యం ఈ రహదారిపై మామిడిపాలెం, మాకవరం, పాపయ్యపాలెం, సంతపాలెం, మార్టూరు, దర్జీనగర్, బవులువాడ, ఊడేరు, దిబ్బపాలెం, అల్లిఖనూడుపాలెం, తుమ్మపాల, వెంకిపాలెం, సీతానగరం, తగరంపూడి గ్రామస్తులతోపాటు చోడవరం, మాడుగుల వంటి ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న రహదారి అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని పక్కన పెట్టేసింది. రూ.30 లక్షలు ఖర్చు చేసి పూడ్చిన గోతులు జలమయంగా మారాయి. కంకర, క్రషర్‌తో మాత్రమే గోతులు పూడ్చడంతో బుగ్గి ఎగిరిపోయి, రాళ్లు తేలిపోయి షరామామూలుగానే మారింది. దీంతో ఖర్చు చేసిన నగదు పట్టుమని పది రోజులు కూడా కాకుండానే బూడిదలో పోసిన పన్నీరైంది.

డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలి



ప్రణాళిక బద్ధంగా రోడ్ల అభివృద్ధి చేయడంపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు. ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయడం ద్వారా నిర్మించిన రోడ్డు మన్నిక ఎక్కువ కాలం ఉంటుంది. తద్వారా రోడ్లపై ప్రభుత్వ ఖర్చు తగ్గుతుంది. ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వాలు మారుతున్నందున ప్రణాళికలు పక్కనపెట్టి కోట్ల రూపాయలు వెచ్చించి కాంట్రాక్టర్ల కేవలం రోడ్లు మాత్రమే వేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో కొన్నాళ్లకే రోడ్లపై గోతులు పడి నీరు చేరి అధ్వానంగా తయారవుతున్నాయి.

– కొణతాల హరినాథ్‌బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, అనకాపల్లి

మోటార్‌తో నీటిని తోడి రోడ్డు క్లీన్ చేశాను



వర్షం పడిన ప్రతిసారి రోడ్డుపై నీరు చేరి చెరువులా తయారవుతోంది. దీంతో స్కూల్‌కెళ్లే పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. చినబాబు కాలనీ వద్ద ఒక వైపు గోతులు ఉండటంతో రోడ్డును మూసివేశారు. మరోవైపు రోడ్డుపై నీరు చేరి చెరువులా ఉండటంతో ఎలా దాటాలో ప్రజలకు తెలియడం లేదు. దీంతో నేనే ఆయిల్ మోటార్‌తో నాలుగు రోజుల పాటు నీటిని తోడి రోడ్డును క్లీన్ చేశాను. అధికారులు స్పందించి శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

– చదరం నాగేష్, చినబాబు కాలనీ, తుమ్మపాల గ్రామం

పరిశుభ్రమైన వాతావరణంలో పాఠశాలలు



మాట్లాడుతున్న ఎంపీడీవో నరసింహారావు

అనకాపల్లి: పరిశుభ్రమైన వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలలు ఉండే విధంగా హెచ్ఎంలు దృష్టి సారించాలని ఎంపీడీవో కె.వి.నరసింహారావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలు, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, నూతన ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలో పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రం చేసిన తర్వాత హెచ్ఎంలు విద్యాశాఖ యాప్‌లో నమోదు చేసేవారన్నారు. ఇక నుంచి ఈ బాధ్యతను సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌కు 2 రోజులు, ఎస్ఎంసీ కమిటీకి 2 రోజులు అప్పగించామన్నారు. ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే ఎమ్మార్సీ రిసోర్స్‌పర్సన్ల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల ఖర్చు వివరాలు ఇవ్వాలని వినతి



ఎంఈవో–2 కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ మండల నాయకులు

అనకాపల్లి: మండల విద్యా శాఖ కార్యాలయానికి మంజూరైన నిధులు ఖర్చు వివరాలు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఎంఈవో–2 కోటేశ్వరరావుకు మంగళవారం ఆయన కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి బాబూరావు, సిరసపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023–24, 2024–25 విద్యా సంవత్సరాలకు ఎంఈవో కార్యాలయానికి, ఎమ్మార్సీకి మంజూరైన వివిధ నిధుల వివరాలు, వాటి ఖర్చు, విద్యార్థి కిట్లకు సంబంధించి హెచ్ఎంలకు రవాణా చార్జీలు, జీతాల బిల్లులు, తదితర వివరాలు అందించాలని కోరారు. వీటితోపాటు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సతీష్, మాకిరెడ్డి రాజ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భరత్‌కుమార్ జన్మదిన వేడుక



రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో భరత్‌కుమార్ కేక్ తినిపిస్తున్న మాజీ ఎంపీ సత్యవతి



కశింకోట పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో భరత్‌కుమార్ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, 82, 83వ వార్డు కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్న లక్ష్మీ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీఐడబ్ల్యూఏ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ కశింకోట, అనకాపల్లి మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, కలగ గున్నయ్యనాయుడు, పార్టీ నేతలు బొడ్డేడ శివ, ఆళ్ల నాగేశ్వరరావు, సలకా సత్యనారాయణ, కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో...

కశింకోట: పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అమీన్‌సాహెబ్‌పేటలోని తన ఇంటి వద్ద మలసాల భరత్‌కుమార్ కేకు కట్ చేసి తల్లిదండ్రులు కాసులమ్మ, రమణారావులకు తినిపించారు. అనంతరం కశింకోట పీహెచ్‌సీలో భరత్‌కుమార్ రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్ రాజు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు మలసాల కుమార్‌రాజా, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి సతీష్, జిల్లా సేవాదళ్ సంయుక్త కార్యదర్శి ఇందలి ముసిలినాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు చిన్ని సన్యాసినాయుడు, యువజన నాయకుడు చిన్ని రాజీవ్ పాల్గొన్నారు.

లింగ వీర్య నిర్ధారణతో ఆడ పెయ్యిలు

పశు గణాభివృద్ధి సంస్థ విశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ రామ్మోహనరావు



పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమం అందజేస్తున్న ఏడీ సౌజన్య



శిబిరాన్ని పరిశీలిస్తున్న పశు గణాభివృద్ధి సంస్థ విశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహనరావు

కశింకోట: పశువులకు లింగ వీర్య నిర్ధారణతో ఆడ పెయ్యిలను ఉత్పత్తి చేయవచ్చునని పశు గణాభివృద్ధి సంస్థ విశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు అన్నారు. మండలంలోని ఏనుగుతుని గ్రామంలో మంగళవారం పశువులకు గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ వీర్య నిర్ధారణ ద్వారా ఆడ పెయ్యిలు కావలసిన వారు సమీప పశు వైద్యులను సంప్రదించాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నరసింగబిల్లి ఆస్పత్రి పశు వైద్యాధికారి చైతన్యమణి శిబిరంలో 42 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. ఖనిజ లవణ మిశ్రమాన్ని, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. 25 పెయ్యిలకు నట్టల నివారణ మందు వేశారు. గర్భకోశ నిపుణుడు పి.భానుబాబు, పశు వైద్యాధికారులు సౌజన్య, అల్ఫోన్సా జార్జ్ తదితరులు శిబిరంలో సేవలందించారు. స్థానిక నాయకులు గొంతిన చిరంజీవి, మలసాల నానాజీ, బొండా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

అనకాపల్లి: ఆలయాల ఉత్సవాలు నిర్వహించే సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక గవరపాలెం, దిబ్బవీధి నాగేంద్ర స్వామి సమేత కల్యాణ సుబ్రహ్మణ్యస్వామిని మంగళవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుడు దొడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు బొడ్డేడ శివ, ఆళ్ల నాగేశ్వరరావు, బొడ్డేడ శివ, కుమార్‌రాజ పాల్గొన్నారు.


అప్పన్నకు విశేషంగా గరుడసేవ



గరుడసేవలో అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతు లిచ్చారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



అసకపల్లిలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన రేకుల షెడ్

సబ్బవరం: మండలంలోని అసకపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమణలను తొలగించాలని గ్రామానికి చెందిన చింతల త్రినాథ్ రెవెన్యూ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వీరయ్యకు లిఖితపూర్వక ఫిర్యాదు అందించారు. వివరాలు.. అసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెం.164లో సుమారు 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అందులో తమ పూర్వీకుల నుంచి 20 సెంట్ల భూమి తమ స్వాధీనంలో ఉందని, తప్పుడు ధ్రువపత్రాలతో ఆక్రమించుకుని షెడ్ నిర్మిస్తున్నారని త్రినాథ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఈ నెల 22న జిల్లా కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ పెట్టుకున్నట్లు తెలిపారు. స్థానిక వీఆర్వో పట్టించుకోకపోవడంతో పూర్తి స్థాయిలో షెడ్ నిర్మించడమే కాకుండా, మరో మూడు షెడ్‌లు నిర్మించారని పేర్కొన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి, సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను తొలగించి, తమకు తమకు న్యాయం చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సింహగిరి కొండల్లో విత్తన బంతులు



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగిస్తున్న రామకృష్ణారావు తదితరులు

సింహాచలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, విత్తన బంతులతో పచ్చదనాన్ని పెంపొందించాలని కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు సూచించారు. సింహగిరిపై లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దేవతా వృక్షాలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కల విత్తనాలతో తయారుచేసిన విత్తన బంతులు జల్లే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పలు రకాల ఔషధాల మొక్కల విత్తనాలు, పేడ కలిపి తయారు చేసిన విత్తన బంతులను కొండల్లోకి విసిరారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి పచ్చదనాన్ని అందించడం మనందరి బాధ్యత అన్నారు. కనుమరుగవుతున్న ఔషధ గుణాలున్న చెట్లను ఎక్కువగా భావితరాలకి అందించాలన్నారు. కనీసం పది మొక్కలనైనా ప్రతి ఒక్కరూ నాటాలని సూచించారు. విత్తన బంతులను తయారుచేసి కొండల్లో వేయడం ద్వారా వర్షాలు పడినప్పుడు అవి తొందరగా భూమిలోకి చొచ్చుకుని, మొక్కలుగా ఎదుగుతాయన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఏవీబీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ హిల్ ఎర్త్ నినాదంతో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్త్ ఈస్ట్ లయన్స్ అధ్యక్షుడు ఎం.సురేష్, వనితా విభాగం ప్రతినిధి ఎస్.సీతారత్నం, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు వంకాయల సాయినిర్మల, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు తొలగించడం అన్యాయం

చోడవరం : పట్టణంలో గతంలో చేసిన ఆక్రమణలన్నీ తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో ఇటీవల రోడ్ల విస్తరణ, కాల్వల నిర్మాణం కోసం పలు ప్రాంతాల్లో పంచాయతీ ఆక్రమణలను తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ తొలగింపులో తమ ఇంటిని కూల్చవద్దంటూ నాగలక్ష్మి అనే మహిళ కుటుంబసభ్యులతో కలిసి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మరి కొంతమంది ఈ నిరసనకు సీపీఐ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ పేదల ఇళ్లను ఆక్రమణల పేరుతో పంచాయతీ అధికారులు కక్షసాధింపుతో తొలగింపు చేయడం అన్యాయమన్నారు. పట్టణంలో గతంలో అనేక మంది పాత చెరువుతోపాటు పంచాయతీ స్థలాను చాలా మంది ఆక్రమించుకొని దుకాణాలు పెట్టుకున్నారని, వాటిని తొలగించకుండా పేదలు నివాసం ఉండడానికి కట్టుకున్న ఇళ్లను మాత్రమే కూల్చడానికి ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com